నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 14 సెప్టెంబర్ 2024 | SANGAREDDY

రాష్ట్రంలో నిరంకుశ పాలన

• దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి •హైదరాబాద్‌లో దుబ్బాక ఎమ్మెల్యే హౌస్ అరెస్టు

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో పోలీసు అధికారులు

దుబ్బాక, సెప్టెంబర్ 13 : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రతినిధులను పోలీసులతో నిర్బంధించడమేనా కాంగ్రెస్ ప్రజాపాలన అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. రేవంత్ సర్కారు మరో నిజాం నిరంకుశ పాలనను తలపిస్తున్నదని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని శుక్రవారం వేకువజామున పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అర్ధరాత్రి నుంచే ఎమ్మెల్యే ఇంటి చుట్టూ భారీగా పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేను ఇంటి నుంచి బయటకు కాలు పెట్టకుండా పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిర్బంధంలో ఉన్నా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తాను మాట్లాడిన వీడియోను దుబ్బాక విలేకరులకు, సోషల్ మీడియాలో షేర్ చేశారు. బీఆర్ఎస్ నాయకులపై, ఎమ్మెల్యేలపై రేవంత్ సర్కారు కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్‌రెడ్డి, టాస్క్‌ఫోర్సు ఏసీపీ శశాంక్, మాదాపూర్ సీఐ శేఖర్‌రెడ్డి, మరో ముగ్గురు ఎస్సైలు సాయంత్రం వరకు ఎమ్మెల్యేను బయటకు రాకుండా అక్కడే ఉంటూ నిర్బంధించారు. దుబ్బాకలో శుక్రవారం వేకువజామున బీఆర్ఎస్ నాయకులను వారి ఇండ్ల వద్దకు వెళ్లి పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. దుబ్బాక పట్టణంతో పాటు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులను వెళ్లనీయకుండా పోలీసులు ఎక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు.



దుబ్బాక పోలీసు స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దాడుల సంస్కృతి సరైంది కాదు

అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్, సెప్టెంబర్ 13: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేయడం, మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్‌రావును, ఇతర మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను అరెస్ట్ చేసి రాత్రి సమయంలో కిలోమీటర్ల మేర తిప్పడం సరైంది కాదని, ప్రజా పాలన అంటే ఇదేనా..? అని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఓ ఎమ్మెల్యేకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి అన్నారు. రాష్ట్రంలో దాడుల సంస్కృతిని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ తీసుకువచ్చిందని, ఇది రాష్ట్ర అభివృద్ధికి మంచిదికాదన్నారు. ప్రభుత్వంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని, రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన సాగుతోందన్నారు. కౌశిక్‌రెడ్డిపై దాడిచేసిన ఎమ్మెల్యేతో పాటు హరీశ్‌రావుపై దురుసుగా ప్రవర్తించిన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు.

నిర్బంధాలు..అరెస్ట్‌లు

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

సిద్దిపేట, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నది. ప్రజాపాలన అందిస్తామంటూ అధికారంలో వచ్చి కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ఖండించినందుకు, కాంగ్రెస్ దౌర్జన్యాలను ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ శ్రేణులపై కక్షగట్టింది. అందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్ట్‌ల పర్వం కొనసాగింది. గురువారం అర్ధరాత్రి నుంచి పోలీసులు బీఆర్ఎస్ నేతల ఇండ్లలోకి వెళ్లి నేతలను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మరికొంత మంది నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. చివరకు శుక్రవారం సాయంత్రం బీఆర్ఎస్ నేతలను విడుదల చేశారు. బీఆర్ఎస్ నాయకులు అక్రమ అరెస్ట్‌లను పార్టీ తీవ్రంగా ఖండించింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోలీసులు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకుల, గృహనిర్బంధాలు, అక్రమ అరెస్ట్‌లను పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లోని కోకాపేటలో తన స్వగృహంలో హౌస్ అరెస్ట్ చేశారు. భుజానికి దెబ్బ తగిలి దవాఖానకు వెళ్తానంటే కూడా పోలీసులు హరీశ్‌రావుకు అనుమతించలేదు. చివరకు ఉన్నతాధికారుల అనుమతితో దవాఖానకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన ఉందా..? అని పార్టీ శ్రేణులు ప్రశ్నించారు. ఇది రాక్షస పాలనలా ఉందని బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. కోకాపేటలో హరీశ్‌రావును పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవిత, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను గేట్ వద్దనే ఆపి అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని గచ్చిబౌలిలోని తన స్వగృహంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలను, ఇతర పార్టీ నేతలను, ముఖ్యులను హౌస్ అరెస్ట్ చేయగా, మరికొంత మందిని అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు.దీంతో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులపై ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగాయి. తమ నేతలను విడిచిపెట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేశారు.బీఆర్ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులు ఎక్కడికక్కడే స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. తమ ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను విడిచిపెట్టి తమ నేతలను అరెస్ట్ చేయడం ఏమిటని పోలీసులను ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ శ్రేణులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుండా, బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, వారి అనుచరులు, కాంగ్రెస్ గూండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

- ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్ట్
- పలువురు నేతల గృహ నిర్బంధం
- గురువారం అర్ధరాత్రి నుంచి ఠాణాల్లో ఉన్న నేతలు
- అరెస్ట్‌లకు నిరసనగా మిన్నంటిన ఆందోళనలు
- కాంగ్రెస్ సర్కారు, పోలీసులపై గులాబీ శ్రేణుల ఆగ్రహం
- రాష్ట్రంలో ప్రజాపాలన లేదని, గూండాగిరీ నడుస్తున్నదని ఆరోపణ
- అక్రమ అరెస్టులపై ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం

మెదక్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

కొంపల్లిలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

సిద్దిపేటలో బీఆర్ఎస్ నాయకులను ఆరెస్టు చేసిన సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పీఎస్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, సెప్టెంబర్ 13: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే తెలంగాణలో ఉద్యమం నాటి రోజులు వస్తాయని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముందస్తుగా బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న సందర్భంగా గజ్వేల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. పోలీసులను అడ్డుపెట్టుకొని సీఎం రేవంత్ దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని, ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ప్రభుత్వం

రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయిస్తూ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి విమర్శించారు. శుక్రవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్న గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, నాయకులు ఎన్సీ సంతోష్ గుప్త, రవీందర్, నర్సింగరావు, స్వామిచారి, చందులకు సంఘీభావం ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండే మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పీఎస్‌లో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

సీఎస్ఆర్ పనులు వెంటనే పూర్తి చేయాలి

- **జిల్లా అభివృద్ధికి పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలి**
- **రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 13: జిల్లాలో సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులపై జిల్లాలోని భారీ, మధ్యతరహా పరిశ్రమల యాజమాన్యాలు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో సామాజిక, విద్య, వైద్యరంగాల అభివృద్ధికి సీఎస్ఆర్ కేటాయింపులపై చర్చించారు. జిల్లాలోని కంపెనీలు అభివృద్ధికి 2శాతం సీఎస్ఆర్ నిధులను విడుదల చేయాలని కంపెనీల ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పాల్గొన్నారు.

రూ.10లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ

హుస్నాబాద్‌లో కరెన్సీ నోట్ల అలంకరణలో వినాయకుడు,పోచారంలో రూ. 4.11లక్షలకు వేలంలో దక్కిన లడ్డూతో భక్తుడు

హుస్నాబాద్, సెప్టెంబర్ 13: హుస్నాబాద్‌లోని వైశ్య భవన్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని కొందరు భక్తులు రూ.10లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. గురువారం రాత్రి అలంకరణ చేసిన భక్తులు శుక్రవారం సందర్శనార్థం ఉంచారు. భక్తులు వచ్చి కరెన్సీ నోట్ల తో అలంకరించబడిన గణనాథుడిని దర్శించుకున్నారు. భక్తులకు సకల సంపదలు కలగజేయాలనే సంకల్పంతోనే స్వామివారికి కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు చేసినట్లు ఆర్యవైశ్య సంఘం నేతలు తెలిపారు.

రూ. 4.11 లక్షలు పలికిన లడ్డూ

పటాన్‌చెరు, సెప్టెంబర్ 13 : పోచారంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం నిమజ్జనం పురస్కరించుకుని లడ్డూ వేలం నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్ రూ. 4.11 లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. గతంలో కంటే ఈసారి లడ్డూ వేలంలో రూ. 11వేలు అధికంగా పలికింది. శ్రీనివాస్‌గౌడ్‌కు యువజన సంఘం ప్రతినిధులు అశోక్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, రాజలింగంగౌడ్, ఇషాన్‌సింగ్ పూజలు నిర్వహించి అందజేశారు.

సిద్దిపేట జిల్లా మద్దూరు జూనియర్ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

రూ.13.80 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్13: సిద్దిపేట జిల్లా మద్దూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్డి లేక విద్యార్థులు పడుతున్న అవస్థలపై ఈనెల 11న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన కథనానికి రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి స్పందించారు. శుక్రవారం కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రానున్న రోజుల్లో రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు తాను కృషి చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. మద్దూరు జూనియర్ కళాశాలలో మరుగుదొడ్డి నిర్మాణం కోసం రూ. 13.80లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నెలన్నర వ్యవధిలో మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. గతంలో 2021లో ప్రభుత్వం మరుగుదొడ్డని మంజూరు చేసిందని, పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాలేదని జిల్లా కలెక్టర్ చెప్పినట్లు తెలిపారు. అనంతరం మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించి స్కూల్‌లో ఉన్న వసతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఐఈవో రవీందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

చిన్ని గుండెకు భరోసా

- **కొండపాక ఆనంద నిలయం వద్ద సత్యసాయి ఆధునిక దవాఖాన**
- **గుండె సమస్యలతో బాధపడే చిన్నారులకు ఉచిత వైద్యం**
- **నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పూర్తిస్థాయి వైద్యసేవలు ప్రారంభోత్సవం**
- **ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్న ప్రముఖులు**

సిద్దిపేట జిల్లా కొండపాకలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన సత్యసాయి సంజీవిని చైల్డ్ హార్ట్ కేర్ అండ్ లీసెర్చ్ సెంటర్

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 13 : దేశ విదేశాల్లోని నిరుపేదలకు విద్య, వైద్యసేవలు అందిస్తున్న 'సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్' తెలంగాణలోనూ తన సేవలను అందిస్తున్నది. సిద్దిపేట జిల్లా కొండపాక శివారులోని ఆనంద నిలయం వృద్ధాశ్రమం వద్ద సత్యసాయి శాంతినికేతన్ బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నది. దీంతో పాటు పుట్టుకతోనే గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులను కాపాడేందుకు 'సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్' సంజీవిని దవాఖానతో చిన్నారుల గుండెకు భరోసా అందించేందుకు ముందుకు వచ్చింది. కొండపాక శివారులోని ఆనంద నిలయంలో 5ఎకరాల విస్తీర్ణంలో రూ.40 కోట్లతో దవాఖాన నిర్మాణానికి 2022 జనవరి 17న భూమి పూజ చేయగా, 2022 నవంబర్ 17న నాటి రాష్ట్ర ఆర్థిక, వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, సద్గురు మధుసూదన సాయి చేతుల మీదుగా ప్రారంభోత్సవం దవాఖాన జరిగింది. కొండపాకలో సత్యసాయి సంజీవిని దవాఖానలో ఏర్పాటు చేసిన చిన్నపిల్లల గుండె సంరక్షణ పరిశోధన కేంద్రం దేశంలో నాలుగోది కావడం విశేషం. మాతా శిశు సంక్షేమ దవాఖాన తొమ్మిదోది అని నిర్వాహకులు తెలిపారు. నయా రాయపూర్ (ఛత్తీస్‌గఢ్), పల్వల్ (హర్యానా), నవీ ముంబై (మహారాష్ట్ర)లో ఈ ట్రస్ట్ ద్వారా మాతా శిశు సంక్షేమ దవాఖానలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. నాలుగోది గజ్వేల్ నియోజకవర్గంలో భాగమైన కొండపాక శివారులో సత్యసాయి సంజీవిని చైల్డ్ కేర్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించి నిర్వహిస్తుండగా, పూర్తిస్థాయిలో వైద్యసేవలను అందుబాటులోకి తేవడంతో నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సద్గురు మధుసూదన సాయిలతో కలిసి సేవలను ప్రారంభించనున్నారు. ఈ దవాఖాన స్థాయిని పెంచి మాతా శిశు సంక్షేమ దవాఖానగా తీర్చిదిద్దనున్నారు. సంజీవిని దవాఖానలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు, మందులు , భోజన వసతి ఉచితంగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆధునిక వైద్య పరికరాలతో నిష్ణాతులైన వైద్యులతో పూర్తిస్థాయి డిజిటల్ ల్యాబ్ పరికరాలతో ఈ దవాఖానను ఏర్పాటు చేశారు. 100 పడకల సామర్థం నుంచి 200 పడకల సామర్థానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇప్పటికే విద్యరంగంలో తనదైన ముద్ర..

కొండపాక శివారులోని ఆనంద నిలయ ట్రస్ట్ ఆవరణలో 12ఎకరాల విస్తీర్ణంలో సత్యసాయి విద్యా సంస్థను ఏర్పాటు చేసి బాలికలకు ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకు ఉచితంగా విద్యను అందిస్తున్నారు. ఇప్పుడు ఇదే ప్రాంతంలో సంజీవిని దవాఖాన ఏర్పాటు చేసి సేవలందించేందుకు సిద్ధమయ్యారు. తన్నీరు హరీశ్‌రావు ఆర్థిక, వైద్యా ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన ప్రత్యేక చొరవతో, మాజీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు కేవీ రమణాచారి సూచనలతో ఈ దవాఖానను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. గతంలో సత్యసాయి విద్యాసంస్థల వార్షికోత్సవ సమయంలో సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధి మధుసూదనా సాయితో హరీశ్‌రావు ప్రత్యేకంగా మాట్లాడి సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రాంతంలో దవాఖాన నిర్మాణం చేయాలని కోరారు. అప్పటి సీఎం కేసీఆర్, ముఖ్య సలహాదారు కేవీ రమణచారి సహకారంతో ఆనంద నిలయం ట్రస్ట్ ఆవరణలో 3 ఎకరాల భూమిని దవాఖానకు నిర్మాణానికి ఇవ్వడంతో పాటు మరో 2ఎకరాల భూమిని ఆనంద నిలయం ట్రస్ట్ నుంచి నామమాత్రపు ధర చెల్లించి కొనుగోలు చేసి 5 ఎకరాల్లో అధునాతన భవంతితో దవాఖానతో పాటు రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో సిద్దిపేట జిల్లాతో పాటు పరిసర జిల్లాల ప్రజలకు సత్యసాయి ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.

నిమ్జ్ రైతులకు త్వరలోనే పరిహారం

ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ రవీందర్‌రెడ్డి

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రేజింతల్‌లో భూములు ఇస్తామని అంగీకార పత్రాన్ని అధికారికి అందజేస్తున్న రైతులు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 13: నిమ్జ్ ప్రాజెక్టుకు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తే త్వరలోనే పరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రేజింతల్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేజింతల్‌లో 1700 ఎకరాల భూమిని నిమ్జ్ ప్రాజెక్టుకు సేకరించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 400 ఎకరాలకు పైగా భూములను రైతులు స్వచ్ఛందంగా నిమ్జ్‌కు ఇచ్చారన్నారు. మిగిలిన రైతులు నిమ్జ్‌కు భూములు ఇవ్వాలని ఆసక్తి ఉంటే తమ అంగీకార పత్రాలను అందజేయాలని సూచించారు. ఎకరాకు రూ.15 లక్షల పరిహారాన్ని అందజేస్తామని తెలిపారు. నిమ్జ్ డిప్యూటీ తహసీల్దార్ జనార్దన్, రాచయ్యస్వామి, సిబ్బంది గోకుల్, పురుషోత్తం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి లొగ్నారు.